

ఉపాధ్యాయుల బదిలీలపై నీలినీడలు!

పాఠశాలలకు వేసవి సెలవులు ముగిసేలోపు ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఈ నెల 10వ తేదీన పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన షెడ్యూలు విడుదలవుతుందనే ఆశతో ఉపాధ్యాయులు ఉన్నారు. ఈలోగా ప్రత్యేక అవసరాలు కలిగిన టీచర్ల బదిలీల కోసం మెడికల్ సర్టిఫికెట్లను తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ప్రిఫరెన్షియల్ కేటగిరిలో బదిలీల విధివిధానాలు సక్రమంగా లేకపోవడంతో దృష్టిలోపం ఉన్నవారు, వితంతు కోటాలోకి వచ్చే వారు బదిలీల్లో తమకు ఇవ్వాల్సిన ప్రాధాన్యతను తగ్గించారని, సరిచేయాలని కోరుతూ ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించారు. దీంతో జూన్ 15వ తేదీ వరకు ఉపాధ్యాయుల బదిలీల అంశంపై యథాస్థితిని కొనసాగించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని ఉపాధ్యాయులు అంటున్నారు. ఈ నేపథ్యంలో వేసవి సెలవులు పూర్తయ్యేలోపు జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ జరుగుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సెలవుల్లో బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటన

10న పదోన్నతులు, బదిలీలపై ప్రభుత్వ ఉత్తర్వులు విడుదలయ్యే అవకాశం!

- **ఇప్పటికే టీచర్ల పదోన్నతులపై కసరత్తు చేస్తున్న విద్యాశాఖ అధికారులు**
- **ప్రిఫరెన్షియల్ కేటగిరిలో బదిలీల విధివిధానాలపై దృష్టిలోపం, వితంతు కేటగిరి ఉపాధ్యాయుల అసంతృప్తి**
- **బదిలీల్లో అన్యాయం జరగవచ్చునని కోర్టులో వేర్వేరుగా పిటీషన్లు**
- **జూన్ 15 వరకు యథాతథస్థితిని కొనసాగించాలని హైకోర్టు ఉత్తర్వులు!**



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఉపాధ్యాయుల బదిలీలు జరిగితే ప్రిఫరెన్సియల్ కేటగిరీలోకి వచ్చే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మెడికల్ సర్టిఫికెట్లు పొందేందుకు గత నెలలోనే విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మచిలీపట్నంలోని సర్వజన ఆస్పత్రిలో ఎన్టీఆర్ జిల్లాలోని 20 మండలాల్లో పనిచేసే టీచర్‌లకు గత నెల 24వ తేదీన సర్టిఫికెట్లు జారీ చేశారు. 25వ తేదీన కృష్ణాజిల్లాలోని 25 మండలాల్లో పనిచేసే టీచర్‌లకు సర్టిఫికెట్‌లు అందజేశారు. 26వ తేదీన ఏలూరు జిల్లా పరిధిలో పనిచేసే టీచర్‌లకు మెడికల్ సర్టిఫికెట్‌లను ఇచ్చారు. ఇంత వరకు బాగానే ఉన్నా దృష్టి లోపం ఉన్న టీచర్లకు కనీస ప్రాధాన్యత ఇవ్వకుండా విధివిధానాలు ఉండటంతో తమకు బదిలీల్లో అన్యాయం జరుగుతోందని ఈ కేటగిరిలోకి వచ్చే ఉపాధ్యాయులు మే 1వ తేదీన హైకోర్టును ఆశ్రయించారు. వీరి వాదనలు విన్న హైకోర్టు జూన్ 15వ తేదీ వరకు టీచర్‌ల బదిలీలపై స్టే విధించింది. సోమవారం వితంతు కోటాలోకి వచ్చే టీచర్‌లు తమకూ బదిలీల్లో కేటాయించిన పాయింట్లలో అన్యాయం జరుగుతోందని హైకోర్టును ఆశ్రయించినట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. వీరి వాదనలు విన్న మిగతా 6లో..

10 శాతం పాఠశాలలను బ్లాక్ చేసి..

ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి దృష్టిలోపం ఉన్న వారు, వితంతువులు కోర్టును ఆశ్రయించడంతో వీరి కోసం 10 శాతం పాఠశాలలను బ్లాక్ చేసి, బదిలీల ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈ రెండు కేటగిరీల వారికి వారు కోరుకున్న ప్రాంతాలకు బదిలీలు చేసే అవకాశం లేకపోలేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు సూచనప్రాయంగా చెప్పుకుంటున్నారు. టీచర్ల బదిలీలకు సంబంధించి విద్యాశాఖలోని ఉన్నతాధికారులు కొందరు ఉపాధ్యాయుల ప్రయోజనాలను పక్కనపెట్టి విద్యాశాఖ సెక్రటరీ, కమిషనర్‌ను పక్కదారి పట్టిస్తున్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కూడా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడంతోనే విజయవాడకు ఊహించని విధంగా ఉపాధ్యాయులు తరలివచ్చి పెద్దఎత్తున నిరసన తెలియజేశారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు గుర్తు చేస్తున్నారు. కొందరు అధికారుల తీరుతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పాలయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని టీచర్‌లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.



ఆక్రమిత స్థలంలో భవన నిర్మాణం, ఆ పక్కనే 'ఇది దేవదాయ శాఖ భూమి' అని తెలియజేస్తూ ఏర్పాటు చేసిన భూమి

శ్రీవారి స్థలం | కబ్జా

యనమలకుదురు కట్ట దిగువన భూ ఆక్రమణ

ఇప్పటికే అక్రమంగా రేకుల షెడ్ల నిర్మాణం

- **తాజాగా ఓ ప్రైవేట్ వ్యక్తి ఆధ్వర్యంలో 100 గజాలు**
- **నానాటికీ కుచించుకుపోతున్న దేవస్థాన స్థలం**
- చోద్యం చూస్తున్న వన్‌టౌన్ వేంకటేశ్వరస్వామి ఆలయ అధికారులు

ఇంద్రకీలాద్రి/పెనమలూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన లక్షల రూపాయల విలువచేసే ఖాళీస్థలాన్ని ఓ వ్యక్తి దర్జాగా కబ్జా చేశాడు. అంతేకాదు.. ఏకంగా పక్కా భవనాన్ని కూడా నిర్మించేస్తున్నాడు. ఖాళీగా ఉన్న ఈ స్థలానికి గతంలో వేలంపాట నిర్వహించగా, ఉచితంగా తీసుకోవాలని ప్రయత్నిస్తున్న ముగ్గురు వ్యక్తులు ఆ వేలాన్ని అడ్డుకున్నారు. ఆ తర్వాత అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఆ ఖాళీస్థలం నిరుపయోగంగా మారింది. వివరాల్లోకి వెళితే..

ప్రైవేట్ వ్యక్తి ఆధ్వర్యంలో పక్కా నిర్మాణం

వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలో వేంచేసి ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానానికి పోరంకిలో ఎకరం పొలం, గూడవల్లిలో ఎకరం పొలం, వేల్పూరులో 9 ఎకరాలు, వేమండలో 9 ఎకరాలకు పైగా భూములు న్నాయి. గవర్నర్‌పేటలో సుమారు పది షాపుల భవన సముదాయం ఉంది. యనమలకుదురు కట్ట దిగువన సుమారు ఏ.2.14 సెంట్ల ఖాళీ స్థలం ఉంది. అందులో సుమారు 85 సెంట్లను గతంలో కొందరు కబ్జాచేసి, రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్నారు. దేవదాయ శాఖ అధికారులు రేకుల షెడ్లను తొలగించటానికి ప్రయత్నించగా, రాజకీయ నాయకులు అడ్డుకుని ఆక్రమణదారులకు అండగా నిలుస్తున్నారు. ఇంకా ఏ.1.29 సెంట్లు ఖాళీగా మిగతా 6లో..

దర్జాగా ఫోర్జరీ!

భద్రిరాజుపాలెం ఫీల్డ్ అసిస్టెంట్ బరితెగింపు

ఉపాధి కూలీల వేలిముద్రలు వేస్తూ దొరికిన కిరణ్‌కుమార్

అవినీతిలో మాకు తిరుగులేదన్నట్లు వ్యవహరిస్తున్నారు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగులు కొందరు. చాటుమాటున చేసే కూలీల వేలిముద్రల ఫోర్జరీ వ్యవహారాన్ని భద్రిరాజుపాలెం ఫీల్డ్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్ మండల పరిషత్ కార్యాలయంలో దర్జాగా చేస్తూ దొరికి పోయాడు. ఇదేంటని ప్రశ్నిస్తే మేట్‌లు నిశాని పేర్లు రాస్తే నేనే వేలి ముద్రలు వేస్తున్నానని సమర్థించుకున్నాడు. ఇందులో తప్పేమి లేదని, మిగతా ఎఫ్ఏలు కూడా ఇలాగే చేస్తున్నారని చెప్పడం గమనార్హం.

- **మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగిన అవినీతి తంతు..**
- **మేట్ నిశాని పేర్లు రాస్తే నేనే వేలిముద్రలు వేస్తున్నానని బొంకు**
- **గతంలో సస్పెండ్ అయ్యి మళ్లీ ఎఫ్ఏగా వచ్చినా మారని బుద్ధి!**



తోట్లవల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో కూర్చుని ఉపాధి కూలీల పేర్లు రాస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్



కిరణ్‌కుమార్ వేసిన కూలీల వేలిముద్రలు ఇవే

తోట్లవల్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): తోట్లవల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో భద్రిరాజుపాలెం ఉపాధి హామీ పథకం ఫీల్డు అసిస్టెంట్ కిరణ్‌కుమార్ సోమవారం కూలీల వేలిముద్రలు ఫోర్జరీ చేస్తూ అడ్డంగా దొరికిపోయాడు. గత వారం రోజులు చేసిన పని వివరాలు, కూలీల హాజరు పత్రాలను సోమవారం అందరూ ఎఫ్ఏలు కార్యాలయంలో అప్పగిస్తారు. కిరణ్‌కుమార్ కూడా అలాగే వచ్చి ఎంపీపీ, ఎంపీడీవోల రూముల దగ్గరే టేబుల్, కుర్చీ వేసుకుని కూలీల హాజరు పత్రాలపై ఎడమ చేతితో వేలిముద్రలు వేయటం కనిపించింది. 32 వర్కులకు సంబంధించి వారం రోజుల్లో 276 మంది కూలీలు మట్టిపని చేశారు. కొంతసేపు పేర్లు రాయటం, ఆ తర్వాత వేలిముద్రలు వేయటం ఎలాంటి చాటుమాటు లేకుండా సాగించాడు. దీంతో మీడియా వెళ్లి వివరం మిగతా 6లో..

గతంలో సస్పెన్షన్‌కు గురైనా మారని తీరు

ఎఫ్ఏ కిరణ్‌కుమార్ ఇలాంటి తప్పులు చేసి గతంలో సస్పెన్షన్‌కు గురయ్యాడు. మళ్లీ ఇటీవల ఎఫ్ఏగా ఉద్యోగం పొందినప్పటికీ అవే పాత తప్పులు చేయటం గమనార్హం. ప్రతి ఏడాది సామాజిక తనిఖీ ప్రజా వేదిక గ్రామసభల్లో ఎఫ్ఏల తప్పులు బయట పడుతున్నాయి. పని చేయని వారికి మస్టర్‌లు వేశారని సామాజిక తనిఖీల్లో వెల్లడవుతోంది. ఇలా వెల్లడైతే కొంత రికవరీకి ఆదేశాలిస్తున్నారు తప్పా పూర్తిస్థాయిలో అవినీతి, అక్రమాలను అరికట్టలేకపోతున్నారు.

నేటి నుంచి ఘాట్‌రోడ్డు మూసివేత

ఇంద్రకీలాద్రికి మెస్ మరమ్మతుల నేపథ్యంలోనే..

మూడు రోజుల పాటు..

ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు, ఉచిత రవాణా

ఇంద్రకీలాద్రి, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కొండప్రాంతానికి మెస్ మరమ్మతుల పనుల కారణంగా మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఘాట్‌రోడ్డుపై రాకపోకలను నిషేధిస్తున్నట్లు దుర్గగుడి ఈవో కె.రామచంద్ర మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ రూట్‌లో వచ్చే భక్తులు పున్నమిఘాట్ వద్ద తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని, అక్కడి నుంచి దేవస్థానం ఏర్పాటుచేసిన బస్సుల్లో కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకోవాలని సూచించారు. చెన్నై, విశాఖపట్నం, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వీఎంసీ కార్యాలయం సమీపంలోని సీతమ్మవారి పాదాల వద్ద ఉన్న హోల్డింగ్ ఏరియాలో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని, అక్కడి నుంచి దేవస్థానం బస్సుల్లో ఆలయానికి చేరుకోవాలని పేర్కొన్నారు. కనకదుర్గానగర్ వైపు ఉన్న మార్గం ద్వారానే కొండపైకి చేరుకునే వీలుంటుందని తెలిపారు. ఈ మూడు రోజులు పార్కింగ్ ప్రదేశాల నుంచి భక్తులకు ఉచిత రవాణా సదుపాయం ఉంటుందని ఈవో స్పష్టం చేశారు.

గల్ఫ్ బాధితురాలికి విముక్తి

6లో

విచారణకు రాజకీయ రంగు

- **అవనిగడ్డలోని జలవనరుల శాఖ ఏఈపై విచారణలో జాప్యం**
- **ఉన్నతాధికారులతో మాట్లాడి నిలుపుదల చేసిన ఓ ఎమ్మెల్యే**

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణాజిల్లాలోని జలవనరుల శాఖలో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)పై విచారణ ముందుకు కదలకపోవడానికి రాజకీయ ప్రమేయమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఉన్నతాధికారులు ఫిబ్రవరిలో విచారణకు ఉత్తర్వులు ఇచ్చినా ఇప్పటి వరకు అడుగు ముందుకు పడకపోవడానికి ఓ ఎమ్మెల్యే సహకరిస్తున్నారని సమాచారం. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'విచారణ ఎప్పటికో' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో అన్ని అక్రమాలకు పాల్పడిన ఏఈపై ఫిబ్రవరిలో విచారణకు ఆదేశించినా ఇప్పటి వరకు ఎందుకు విచారణ జరగలేదన్న దానిపై ఆ శాఖలో చర్చ మొదలైంది.

అడ్డుకుంటున్నది ఎవరు..?

ఏఈపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ చేయాలని ఉత్తర్వులు ఇచ్చిన అధికారులే ఒక అడుగు వెనక్కి వేసినట్లు జలవనరుల శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం ఆ అధికారులపై కృష్ణాజిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే ఒత్తిడేనని సమాచారం. వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ ఎమ్మెల్యేల మాటల్నే ఆదేశాలుగా భావించి, నిబంధనలను ఉల్లంఘించి పనిచేసిన అధికారులను కూటమి ప్రభుత్వం బదిలీ చేసింది. ఆరోపణలు రుజువైన వారిపై వేటు వేసింది. వైసీపీ పాలనలో తానే జలవనరుల శాఖలో జిల్లా అధికారిగా వ్యవహరించిన ఈ ఏఈ మాత్రం పరిస్థితులకు అనుగుణంగా చక్రం తిప్పారు. ఆయన ఎక్కడ పనిచేసినా అధికార, ప్రతిపక్ష నేతలను సమన్వయం చేసుకుని ముందుకు సాగుతారన్న ప్రచారం జరుగుతోంది. సర్వీసులో ఎక్కువ కాలం అవనిగడ్డ నియోజకవర్గంలో పనిచేయడంతో అక్కడ అన్ని పార్టీల నేతలతో సత్సంబంధాలు కొనసాగించడంలో ఆయన సఫలీకృతులయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జలవనరుల శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. అయినా ఈ అసిస్టెంట్ ఇంజనీర్ మాత్రం తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. పైగా ఓ సబ్ డివిజన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను దక్కించుకున్నారు. ఈ మొత్తం ప్రక్రియ వెనుక ఓ ఎమ్మెల్యే చక్రం తిప్పారని ఆరోపణలు ఉన్నాయి. ఆయనే ఇప్పుడు శాఖాపరమైన విచారణను నిలుపుదల చేయించినట్లు తెలిసింది.


తాగునీటి సమస్య లేకుండా చర్యలు



● అధికారులతో కలెక్టర్ బాలాజీ 6లో

మిర్చికి ధర పోటు!

- నాడు పంట కాపాడుకునేందుకు భారీగా పెట్టుబడులు
- నేడు కోత కూలీ కూడా రాకపోవడంతో పంట దున్నేస్తున్న రైతులు
- రూ.11,750 ధర అమలు చేయాలని డిమాండ్



ధరలు క్షీణిస్తుండటంతో మిర్చి రైతులు డీలా పడుతున్నారు. అండగా ఉండాల్సిన స్పైసెస్ బోర్డు ముఖం చాటేసింది. కేంద్ర మద్దతు ధర ప్రకటనలకే పరిమితమైంది. ఫలితంగా మిర్చి రైతులు కోలుకోలేని స్థితికి చేరుకున్నారు. కోత కూలీ కూడా రాని స్థితిలో పంటను కూడా మట్టిలో కలుపుతున్నారు. కాయలతోనే పంటను దున్నేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర మద్దతు ధర అమలుచేసేలా నాఫెడ్, మార్క్‌ఫెడ్‌లను సంప్రదించి ప్రభుత్వం ఆదుకోవాలని మిర్చి రైతులు డిమాండ్ చేస్తున్నారు.

(నందిగామ, ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది మిర్చి సాగు ఆసాంతం ఆటుపోట్ల నడుమ సాగింది. సాగు ప్రారంభంలోనే భారీ వర్షాలు, వరదలకు మొక్క దశలో ఉన్న పంట దెబ్బతింది. అనంతరం కొత్త రకాల చీడపీడలను అదుపులో పెట్టేందుకు భారీగా క్రిమి సంహారకాలు వినియోగించాల్సి వచ్చింది. ఎలాగైనా పంటను కాపాడుకొనే క్రమంలో భారీగా ఎరువులు కూడా అందించాల్సి వచ్చింది. దీంతో పెట్టుబడులు భారీగా పెరిగాయి. కౌలు ధరతో కలిపి సాగు వ్యయం ఎకరానికి సరాసరి లక్షన్నర వరకూ ఖర్చయింది. దిగుబడులు 18 నుంచి ఇరవై క్వింటాళ్లకు పడిపోయింది. ఈ ప్రకారం క్వింటా దిగుబడికి ఏడు నుంచి తొమ్మిది వేల రూపాయల వరకూ ఖర్చయింది. ఇది కేవలం పంట పండించే ఖర్చు మాత్రమే. ఇక కోత కూలి, టిక్కీల కొనుగోలు, టిక్కీలకు కాయలు తొక్కే ధర, వాటిని ఇంటికి చేర్చే రవాణా ఖర్చులు అన్నీ కలిపి క్వింటాకు ఐదు నుంచి ఆరువేల రూపాయల ఖర్చయింది. ఈ మొత్తం కలిపితే పంట ఇంటికి చేరే సరికి 13 నుంచి 15 వేల రూపాయల వరకూ ఖర్చయింది.

గత పాలకుల అనాలోచిత విధానాలు

గత వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా మిర్చికి ఏడు వేల రూపాయల మద్దతు ధర ప్రకటించారు. నిన్నమొన్నటి వరకూ అదే మద్దతు ధర కొనసాగింది. మిర్చి సాగులో ఆటుపోట్లు గమనించిన కూటమి ప్రభుత్వం ముందుగానే మేల్కొని మద్దతు ధర పెంపునకు చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర పెద్దలతో మాట్లాడి క్వింటాకు రూ.11750 మద్దతు ధరను ప్రకటింపజేశారు. వాస్తవానికి ఈ ఏడాది నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో ఆ ధర కూడా ఏమాత్రం సరిపోదు. ప్రకటించిన మద్దతు ధర అందించడంలో విఫలం కావడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర నష్టాల పాలైన మిర్చి రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కన్నెర్రజేస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.11750 ధర అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖం చాటేస్తున్న స్పైసెస్ బోర్డును రంగంలోకి దింపి నాఫెడ్, మార్క్‌ఫెడ్‌ల ద్వారా మిర్చి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. లేదా ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేసిన ధరకు, మద్దతు ధరకు ఉన్న వ్యత్యాసాన్ని తమకు జమచేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో నాణ్యత, రకాలను బట్టి మిర్చి ధరలు ఏడు నుంచి తొమ్మిది వేల రూపాయల ధర లభిస్తుంది. మిర్చి రైతుకు మేలు జరగాలంటే క్వింటాకు 15 నుండి 16 వేల రూపాయల ధర ఉండాల్సి ఉంది. కనీసం కేంద్రం ప్రకటించిన మద్దతు ధర ఉన్నా కొంత మేర ఊరట లభిస్తుందని రైతులు అంటున్నారు.

మిర్చి చరిత్రలోనే దయనీయమైన పరిస్థితులు

మిర్చి సాగులో గతంలో లేని పరిస్థితులను రైతులు ఎదుర్కొంటున్నారు. చివరి కోతలు కోయాల్సిన స్థితిలో కేంద్రం ఉపాధి పనులు ప్రారంభించింది. దీంతో కూలీల కొరత ఏర్పడింది. సాధారణంగా మిర్చి కోతలు ఉదయాన్నే చేపట్టాల్సి ఉంది. ఆ సమయంలో ఉపాధి పనులు ప్రారంభమౌతున్నాయి. అక్కడైతే కొద్ది సమయం పనిచేస్తే మూడు వందల రూపాయల కూలీ లభిస్తుంది. మిర్చి కోతలకు కూలీలు వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు పంటను దున్నివేస్తున్నారు. ఈ పరిస్థితుల నుంచి మిర్చి రైతును ఆదుకోవాలంటే ఉపాధి కూలీలతో మిర్చి కోతలు కోయించాల్సి ఉంది.

ధర పతనానికి కారణాలు

మిర్చి ధరలు పడిపోవడంపై మార్కెట్ నిపుణల అంచనా ప్రకారం గత ఏడాదికి సంబంధించి నిల్వలు అధికంగా ఉన్నాయి. 2023-2024 సంవత్సరాలలో క్వింటాకు గరిష్ఠంగా 21 నుండి 23 వేల రూపాయల ధర లభించింది. ఒక్కసారిగా ధర పెరగడంతో మరింత పెరిగే అవకాశాలు ఉంటాయని భావించిన రైతులు సరుకు నిల్వ ఉంచారు. వర్షాలు, వరదల వల్ల కృష్ణా, గుంటూరు జిల్లాలో పంట దిగుబడి తగ్గిందని, మిగిలిన ప్రాంతాలలో మంచి దిగుబడులు వచ్చినట్లు వారు తెలిపారు. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో ఈఏడాది సాగు విస్తీర్ణంతో పాటు దిగుబడులు కూడా గణనీయంగా ఉన్నాయి. దీని వల్లనే డిమాండ్ తగ్గి మిర్చి ధరలు క్షీణించాయని నిపుణులు చెపుతున్నారు. ఏది ఏమైనా ఈ పరిస్థితుల నుంచి మిర్చి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాల్సి ఉంది.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

- అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధితోపాటు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. తాడిగడప మునిసిపాలిటీలోని కానూరులో సుమారు రూ.60 లక్షలఅంచనాతో నిర్మించ తలపెట్టిన సీసీ డ్రైన్లు, రోడ్ల నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మునిసిపాలిటీలో పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయడానికి ప్రజలు సహకరించాలని కోరారు. రూ.21లక్షలతో బందరు రోడ్డు నుంచి పంట కాల్వ రోడ్డు వరకు సీసీ డ్రైను, రూ.20.5 లక్షలతో ఉమాశంకర్‌నగర్‌లో సీసీ రోడ్డు, రూ.19.9 లక్షలతో స్వర్ణ హైట్స్ నుంచి పిన్నమనేని టీచర్స్ కాలనీ వరకు సీసీ రోడ్డు, సీసీ డ్రైను, కల్వర్టుల నిర్మాణానికి కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, టీడీపీ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, జనసేన అధ్యక్షుడు తాతపూడి గణేష్, శొంఠి శివరాంప్రసాద్, పీతా గోపీచంద్, దోనేపూడి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన



కానూరులో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ఉయ్యూరు: రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజాసంక్షేమం ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన చేస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు నగరపంచాయతీ 16వ వార్డులో రూ.14.50 లక్షలతో అంతర్గత రోడ్లు, సీసీడ్రైనేజీ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కూటమి పాలనలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. చైర్మన్ వి.సత్యనారాయణ, వార్డు కౌన్సిలర్ పూర్ణిమ, కమిషనర్ పి.వెంకటేశ్వరరావు, మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, కూనపరెడ్డి వాసు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రోడ్డుపై సీజ్డ్ బైక్‌ల హల్‌చల్?

ఉంగుటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : సరైనపత్రాలు లేకుండా రోడ్లపై తిరిగే వాహనాలను సీజ్‌చేసి పోలీస్ స్టేషన్‌లో భద్రంగా ఉంచాల్సిన పోలీసులు వాటిని బయటకు తీసి వాడుకుంటున్నారంటూ వాట్సాప్ గ్రూపుల్లో ఒక వార్త హల్ చల్ చేసింది. పీఎస్‌లో వుండాల్సిన బైక్ వేరే చోట ప్రత్యక్షమవడం చర్చనీయాంశమైంది. గన్నవరం కాటా చెక్‌పోస్ట్ వద్ద గతనెల 19న ఆత్కూరు ఎస్సై చావా సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. లైసెన్స్ లేకుండా బండి నడుపుతున్న గన్నవరానికి చెందిన షేక్ ఫర్హాన్ అనే యువకుడి కేటీఎం బైక్‌ను సీజ్ చేసి ఆత్కూరు పీఎస్‌కు తరలించారు. అదే బైక్ సోమవారం పెదఅవుటపల్లి ఆర్చ్ వద్ద స్థానికులు గుర్తించి బైక్ యజమానికి సమాచారం ఇచ్చారు. వెంటనే పెదఅవుటపల్లి వచ్చిన వాహనదారుడు పోలీస్ స్టేషన్‌లో వుండాల్సిన తన బైక్ బయటకు ఎలా వచ్చిందో తెలియక ఆందోళన చెందాడు. పోలీసులు వాడుకుంటున్నారేమోనని అనుమానం వ్యక్తంచేశాడు. సీజ్‌చేసిన వాహనాన్ని వాడుకునే అధికారం పోలీసులకు ఉందా అని ప్రశ్నించాడు.

పోలీసులు సీజ్‌చేసిన బైక్ బయట ప్రత్యక్షం



పెద అవుటపల్లిలో పోలీసులు నిలిపివుంచిన బైక్

దొంగలను ట్రాప్ చేసేందుకే..: ఎస్సై సురేష్

బైక్ దొంగతనాలకు పాల్పడే నిందితులను ట్రాప్‌చేసి పట్టుకోవడానికే కేటీఎం బైక్‌ను రెండు రోజులుగా పెదఅవుటపల్లి ఆర్చి వద్ద సీసీ కెమెరాల ఎదురుగా నిలిపి సిబ్బంది అబ్జర్వేషన్‌లో వుంచామని ఆత్కూరు ఎస్సై చావా సురేష్ తెలిపారు. దొంగలు కేటీఎం బైక్‌పట్ల ఆకర్షితులవుతున్నారని ఈ ట్రిక్ వాడామన్నారు. బైక్‌ను ఏ కానిస్టేబుల్ సొంతానికి వేసుకుని తిరగలేదని, అందరికీ వాహనాలున్నాయని స్పష్టంచేశారు. బండిని ఎలాగైనా విడిపించుకునేందుకు పోలీసులపై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. సదుద్దేశ్యంతో చేసిన చర్యను వక్రీకరించి వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేయడం సరికాదని ఎస్సై సూచించారు.



కోడెబోయిన బాబికి బహుమతి అందజేస్తున్న డాక్టర్ శ్రవణ్‌కుమార్, సర్పంచ్ పిల్లా అనిత, గుండపనేని ఉమావరప్రసాద్, డాక్టర్ దివ్య

పశువుల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం

- ఏడీ డాక్టర్ శ్రవణ్‌కుమార్ ● లేగదూడల అందాల పోటీలు

హనుమాన్‌జంక్షన్ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తూ పాల దిగుబడి ద్వారా రైతుకు అదనపు ఆదాయ వనరు సృష్టించేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్థకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రవణ్‌కుమార్ సూచించారు. వీరవల్లిలో పశువైద్యాధికారి డాక్టర్ దివ్య ఆధ్వర్యంలో సోమవారం లేగదూడల అందాల పోటీలను ప్రారంభించారు. కోడెబోయిన బాబికి చెందిన ఒంగోలు జాతి 8 నెలల ఆవుదూడ ప్రథమ స్థానంలో నిలిచింది. పెయ్యదూడల ఉత్పత్తి పథకం ద్వారా లింగ నిర్ధారిత వీర్యాన్ని ఉపయోగించడంతో రైతులకు మేలుజాతి పెయ్య దూడలను 90 శాతం వరకూ ఖచ్చితంగా అందించవచ్చన్నారు. పశువుల బీమా సౌకర్యం, సబ్సిడీపై దాణా, పచ్చిగడ్డి విత్తనాలను అందిస్తూ పాల దిగుబడిని పెంచుతూ రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకున్నదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లా అనిత, గుండపనేని ఉమావరప్రసాద్, సెమన్ బ్యాంక్ వీఎస్ఏ డాక్టర్ హరిత, అర్వపల్లి వేణు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.



గుండేరు డ్రైన్ వద్ద యువతి కోసం వెతుకులాడుతున్న మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు తదితరులు

యువతి అదృశ్యం

వివాహం ఖాయమైనందుకే ఇంట్లోంచి వెళ్లిపోయిందా?

మచిలీపట్నం టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): వివాహం నిశ్చయమైన మరునాడే ఎన్ గొల్లపాలెంకు చెందిన ఒక యువతి అదృశ్యమైంది. ఈ మేరకు రూరల్ ఎస్ఐ నాగరాజు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఎన్ గొల్లపాలెంకు చెందిన కుక్కల విద్యకు బావతో ఆదివారం నిశ్చితార్థం జరిగింది. ముందుగా విద్య వివాహానికి అంగీకరించింది. దీంతో విద్యకు తల్లిదండ్రులు వివాహం చేసేందుకు ముందుకొచ్చారు. అయితే అకస్మాత్తుగా సోమవారం మధ్యాహ్నం విద్య తన ఇంట్లో ఉన్న టీవీఎస్ బండి వేసుకుని ఎన్ గొల్లపాలెం నుంచి చిన్నాపురం మీదుగా గుండేరు వద్దకు వచ్చింది. గుండేరు వద్ద టీవీఎస్, విద్య చెప్పులు కనబడ్డాయి. తన కుమార్తె కనబడటం లేదన్న బాధతో తండ్రి సురేష్‌బాబు దగ్గరలో చిన్నాపురంలోని మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావుకు తెలిపాడు. తహసీల్దార్ మధుసూదనరావు, ఎస్ఐ నాగరాజు పోలీసు బలగాలతో గుండేరు వద్దకు తరలివచ్చారు. డ్రోన్ కెమెరాలతో వెతుకులాట ప్రారంభించారు. పడవలు వేసుకుని పోలీసులు, గజ ఈతగాళ్లు వెదుకుతున్నారు. చీకటి పడటంతో ఫోకస్ లైట్లు వేసుకుని గుండేరు వద్ద వెతుకులాట ప్రారంభించారు. సురేష్ బాబుకు ఇద్దరు ఆడపిల్లలు. విద్య పెద్ద కుమార్తె. సురేష్‌బాబు ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్య కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మొక్కల పంపిణీపై దృష్టి సారించండి

- కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబరులో జేసీ గీతాంజలి శర్మతో కలిసి జిల్లాలో మొక్కల పంపిణీ, వాటి సంరక్షణపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యక్తిగత గృహాల ఆవరణల్లో మొక్కల పెంపకానికి ప్రతి ఒక్కరూ ముందుకొచ్చేలా ప్రజలను అధికారులు చైతన్యవంతం చేయాలన్నారు. మచిలీపట్నానికి చెందిన డాక్టర్ రాళ్లపల్లి లక్ష్మణస్వామి మచిలీపట్నంలో లక్ష మొక్కలను పెంచే లక్ష్యంగా పెట్టుకున్నారని, వాటిని నగర ప్రజలకు అందిచేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. జిల్లాలో 10 ప్రాంతాల్లో బస్టాప్‌ల వద్ద షెల్టర్లను నిర్మాణం చేసే ఆలోచన చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, డ్వామా పీడీ శివప్రసాద్, కృష్ణా వర్సిటీ వీసీ ఎన్ ఉష, అటవీశాఖ అధికారి సునీత వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

- అధికారులతో కలెక్టర్ బాలాజీ



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, చిత్రంలో ఎమ్మెల్యే వెనిగండ్ల, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి తదితరులు

గుడివాడ, మే 5 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో నియోజకవర్గ స్థాయి ప్రభుత్వాధికారుల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణ, పీఎం సూర్యఘర్ తదితర ప్రభుత్వ పథకాల ప్రగతిపై సమీక్షించి వాటి అమలులో ఉన్న ఇబ్బందులపై చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా తాగునీరు, రహదారులు, టిడ్కో కాలనీలో సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ రాబోవు సీజన్‌లో రైతుల సమస్యలపై తీసుకోవలసిన ముందస్తు చర్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లానన్నారు. వేసవికి ముందే నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న డెక్క, చెత్త, చెదారాన్ని తొలగించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ప్రధానంగా నియోజకవర్గంలో ఉద్యానవన పంటల అభివృద్ధిపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేసినట్టు ఎమ్మెల్యే వెనిగండ్ల తెలిపారు. అధికారులతో నిర్వహించే సమీక్ష సమావేశాలు ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఆర్‌డీవో బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, నియోజకవర్గంలోని తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, ఇరిగేషన్, డ్రైనేజీ, గృహనిర్మాణ, వ్యవసాయ, పురపాలక, రెవెన్యూ తదితర శాఖల అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను అప్రమత్తం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్టు కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక ఆర్‌డీవో కార్యాలయంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కొన్ని మండలాల్లో ఎక్కువగా వర్షపాతం నమోదైందన్నారు. బంటుమిల్లి మండలంలో 109.2 మిల్లీమీటర్లు, కంకిపాడు మండలంలో 56.2 మి.మీ, ఉయ్యూరు మండలంలో 52.2 మి.మీలు వర్షపాతం నమోదైందన్నారు. జిల్లాలో ప్రధానంగా 76 హెక్టార్లలో ఉద్యాన పంటలు, 64 హెక్టార్లలో అరటి తోటలు దెబ్బతిన్నాయని కలెక్టర్ తెలిపారు. ఎక్కడైనా విపత్తు సంభవిస్తే జిల్లా అధికారులు తక్షణమే స్పందించి ఆదుకుంటుందనే నమ్మకం ప్రజల్లో రావాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం మంగళవారం బాధితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ ఆదేశించారు.

గల్ఫ్ బాధితురాలికి విముక్తి

- మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే వెనిగండ్లకు ధన్యవాదాలు తెలిపిన బాధితురాలు



బాధితురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గుడివాడ, మే 5 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ చూపిన చొరవ, స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సహకారంతో మరో గల్ఫ్ బాధితురాలికి విముక్తి కలిగింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోకపోవడంతో గత సెప్టెంబర్‌లో మస్కట్ వెళ్లానని, తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తాయని, స్వదేశానికి వెళ్లిపోదామంటే తన పాస్‌పోర్టు, ఫోన్ లాక్కుని ఇబ్బందులకు గురిచేశారని, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పుణ్యామాని ప్రాణాలతో బయటపడ్డానని బాధితురాల ఉండ్రమట్ల ప్రేమకుమారి తెలిపారు. సోమవారం స్థానిక ప్రజావేదికలో స్థానిక 30వ వార్డుకు చెందిన గల్ఫ్ బాధితురాలు ఉండ్రమట్ల ప్రేమకుమారి, కుటుంబసభ్యులతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్లను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రేమకుమారి మాట్లాడుతూ తెలిసిన వ్యక్తుల ద్వారా తాను మస్కట్‌కు వెళ్లానని, వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఎలర్జీ వచ్చిందన్నారు. అక్కడ యజమానికి చెబితే వేరేచోటుకు పంపించారన్నారు. శరీరమంతా ఎలర్జీ వ్యాప్తి చెందటంతో తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొన్నానని కన్నీటిపర్యంతమయ్యారు. తనను మస్కట్‌కు తీసుకువచ్చిన ఏజెంట్ కువైట్‌లో ఉండటంతో అతడిని సంప్రదించడానికి వీలుపడలేదని, కనీసం తానెక్కడున్నానో కూడా తెలియని దుర్భరస్థితి నెలకొందన్నారు. తన కష్టాలను కుటుంబసభ్యులకు చెప్పి ఏడ్చానన్నారు. యజమానులు తన వద్దనున్న పాస్‌పోర్టు, ఫోన్ లాక్కొన్నారన్నారు. మార్చిలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దృష్టికి తన కుటుంబసభ్యులు తీసుకువెళ్లగా స్పందించిన వెనిగండ్ల మంత్రి లోకేశ్‌తో మాట్లాడితే లోకేష్ టీం తనను సంప్రదించారని గుర్తు చేసుకున్నారు. ఇండియన్ ఎంబసీ అధికారులు తనకు భరోసా కల్పించారని, ఎట్టకేలకు తాను స్వదేశానికి తిరిగి వచ్చానని కన్నీటిపర్యంతమయ్యారు.

అర్జీల పరిష్కారంలో చొరవ చూపాలి: ట్రైనీ కలెక్టర్

మచిలీపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై వచ్చే అర్జీలను అధికారులు తక్షణం పరిష్కరించాలని ట్రైనీ కలెక్టర్ ఫర్హీద్ జైన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సోమవారం అధికారులతో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 126 మంది అర్జీలు అందజేశారు. క్యారీబ్యాగుల వాడకాన్ని తగ్గించాలని, వస్త్రంతో తయారుచేసిన చేతిసంచులను వాడాలని, పర్యావరణ పరిరక్షించాలని కోరుతూ మానవత సంస్థ రూపొందించిన చేతిసంచులను అధికారులు ఆవిష్కరించారు. డీఆర్వో కే చంద్రశేఖరరావు, మచిలీపట్నం ఆర్డీవో కే స్వాతి, కేఆర్‌సీసీ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



చేతిసంచులను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఉపాధ్యాయుల బదిలీలపై నీలినీడలు!

(5వ పేజీ తరువాయి)

హైకోర్టు దృష్టిలోపం ఉన్న టీచర్ల బదిలీల అంశం మాదిరిగానే జూన్ 15 తర్వాత వితంతు టీచర్ల బదిలీల అంశంపై విచారణ చేస్తామని చెప్పినట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. దుబాయ్‌లో ఉన్న విద్యాశాఖ సెక్రటరీ టీచర్‌ల బదిలీల అంశంపై గత శుక్రవారం ఉపాధ్యాయ సంఘాల నేతలతో గూగుల్‌మీట్ నిర్వహించినట్లు టీచర్లు పేర్కొంటున్నారు.

తొలుత పదోన్నతులు.. ఆ తర్వాత బదిలీలు

బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ఈ నెల 10న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు విడుదల కాకముందే జిల్లాలో పనిచేస్తున్న టీచర్లకు పదోన్నతులు ఇచ్చేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా టీచర్‌ల సీనియారిటీ జాబితాల తయారీపై జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్‌లు(ఎస్‌జీటీ), స్కూల్ అసిస్టెంట్‌లు (ఎస్‌ఏ)లు ఎంతమందికి పదోన్నతి ఇవ్వాలనే అంశంపై ఇప్పటికే జాబితాలను రూపొందిస్తున్నారు. పాఠశాలల విలీనం, ప్రభుత్వం నిర్దేశించిన విధంగా తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలనే నిబంధనలు, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని టీచర్లు ఎంతమందిని బదిలీ చేయాల్సి వస్తుందనే అంశంపైనా లెక్కలు చూస్తున్నారు. దీంతో పాటు గణితం, ఇంగ్లీష్, సైన్స్ సబ్జెక్టులలో ఇప్పటికే మిగులుబాటుగా ఉన్న ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారు.. వారిని వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఏయే పాఠశాలల్లో సర్దుబాటు చేయాలనే అంశంపైనా జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. టీచర్ల పదోన్నతులు, బదిలీలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు విడుదల అయితే ఆలస్యం లేకుండా ఈ ప్రక్రియలను పూర్తి చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు తమవంతు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

శ్రీవారి స్థలం కబ్జా

(5వ పేజీ తరువాయి)

ఉంది. ఈ స్థలంలో 2014 నుంచి 2019 వరకు నాటి వేంకటేశ్వరస్వామి దేవస్థాన అధికారులు, గుమస్తాల పర్యవేక్షణ కొరవడటంతో 11 మంది రేకుల షెడ్లు నిర్మించారు. అందులో దేవస్థానం అధికారులు 6, 7 ఇళ్లపై కోర్టులో కేసు వేశారు. మిగిలిన వాటి గురించి పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. ప్రస్తుతం స్థానికంగా ఉంటున్న ఓ ప్రైవేట్ వ్యక్తి సుమారు రూ.70 లక్షలకు పైగా విలువచేసే 100 గజాలకు పైగా స్థలాన్ని దర్జాగా కబ్జాచేసి పక్కా నిర్మాణం చేపడుతున్నాడు. దేవస్థానం అధికారులు, ఉద్యోగులు ఆ ఖాళీస్థలంవైపు కన్నెత్తి చూడకపోవటంతో కబ్జాదారులు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. ఆలయ భూమిని కాపాడాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ స్థలం కబ్జాకు గురికాకుండా భద్రతా చర్యలు చేపట్టి దేవస్థానానికి ఆదాయం పెంచేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

నిర్మాణ పనులు అడ్డుకున్నాం

యనమలకుదురు కట్ట దిగువన దేవస్థానానికి చెందిన ఖాళీ స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించుకుని నిర్మాణ పనులు చేపడుతున్నాడని సమాచారం తెలుసుకున్నాం. అక్కడకు వెళ్లి పనులు అడ్డుకున్నాం. నిబంధనలకు విరుద్ధంగా భూమిని ఆక్రమించుకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

\- సన్యాసిరావు, వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవో

దర్జాగా ఫోర్జరీ!

(5వ పేజీ తరువాయి)

అడగ్గా మేట్ కూలీల పేర్లు రాశాడని, ఇంటింటికి తిరిగి నిశాని కూలీలతో వేలిముద్రలు వేయించటం కుదరదని, మేట్ స్టాంప్ ప్యాడ్ అడుగుతాడని, అందుచేత నేనే వేలిముద్రలు వేస్తున్నానని, ఇలా వేయవచ్చని కిరణ్‌కుమార్ చెప్పటం జరిగింది. ఇక్కడ కూర్చుని కూలీల పేర్లు ఎలా రాస్తారని, కూలీలకు తెలియకుండా అందరి వేలిముద్రలు మీరు వేయటం నేరమని తెలియదా అంటే ఇందులో తప్పేమి లేదని, మిగతా ఎఫ్ఏలు కూడా ఇలాగే చేస్తున్నారని కిరణ్‌కుమార్ చెప్పాడు. ఇంతలో ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ విజయకుమార్‌రెడ్డి వచ్చి ఇంకోసారి ఇలా జరగకుండా చూస్తామన్నారు. తర్వాత ఎంపీడీవో రవికాంత్ వచ్చి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలీల వేలిముద్రలు వేయటం చాలా తప్పని, ఈ పత్రాలన్నీ చింపేసి మరలా కూలీలతో స్వయంగా వేలిముద్రలు, సంతకాలు తీసుకుని హాజరు పత్రాలు కార్యాలయంలో అప్పగించాలని ఎంపీడీవో ఆదేశించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	148, 157, 168
చికెన్ విత్ స్కిన్	286
చికెన్ స్కిన్‌లెస్	296

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

బైక్ నుంచి జారి పడి మహిళ మృతి

ఉయ్యూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిలో గండిగుంట సెంటర్ వద్ద ఆదివారం రోడ్డు దాటుతున్న వ్యక్తిని తప్పించే ప్రయత్నంలో బైక్ అదుపుతప్పి వెనుక కూర్చున మహిళ కిందపడి మృతి చెందింది. ఇబ్రహీంపట్నానికి చెందిన గుమ్మడి వీరాస్వామి భార్య భవానీ (36)తో కలిసి ఆదివారం రాత్రి గుడివాడ నుంచి మోటార్ సైకిల్‌పై విజయవాడ వైపు వస్తున్నారు. దత్తాశ్రమం వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తి అడ్డురావడంతో అతనిని తప్పించే ప్రయత్నంలో బైక్ అదుపుతప్పింది. ఈ ఘటనలో వెనుక కూర్చున్న భవానీ కింది పడి అక్కడికక్కడే మృతిచెందింది. సంఘటన స్థలాన్ని పట్టణ ఎస్సై విశ్వనాథ్ సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



చినఓగిరాలలో తడిసిన ధాన్యం ఎండబెడుతున్న కూలీలు

అకాల వర్షంతో రైతుల అవస్థలు

ఉయ్యూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలో ఆదివారం కురిసిన అకాల వర్షానికి రైతులు తీవ్రంగా నష్టపోయారు. చినఓగిరాల, పెదఓగిరాల పరిధిలో దాళ్వా సాగుచేసిన రైతులు పంటకోత కోసి ఆరబెట్టిన తరుణంలో ఈదురు గాలులతో కూడిన కురిసిన భారీ వర్షానికి ధాన్యం తడిసి పోవడంతో కూలీలతో తిరిగి ఆరబెట్టుకుంటూ నానా అవస్థలు పడుతున్నారు. చినఓగిరాలకు చెందిన రైతు యెనిగళ్ల కుటుంబరావు 16ఎకరాల్లో పంట కోత కోసి ధాన్యం రాశిపై ఉండగా వర్షం కురిసి తడిసి పోయింది. గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ క్రాప్ చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి చిన ఓగిరాల, పెదఓగిరాల గ్రామాల్లో ఏర్పడిందని కుటుంబరావుతో పాటు పలువురు రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. మొక్కజొన్న పండించిన రైతులు పంట కోత కొచ్చిన సమయంలో గాలి వానకు నేలివాలింది.



తహసీల్దార్ వెంకట శివయ్య వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎంయూపీ నాయకులు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గన్నవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు బి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కె.వెంకట శివయ్యకు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు అనారోగ్య సెలవుల్లో పూర్తి జీతం చెల్లించాలన్నారు. జీవో 114లో పొందు పరిచిన మేరకు నైట్ అవుట్ అలవెన్స్‌లు రూ.150 నుంచి 400 వరకు చెల్లించాలన్నారు. పి.ఉషారాణి, బాలరాజు, బి.జె.కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చోడవరం గ్రామ టీడీపీ అధ్యక్షునిగా ఎంపికయిన శ్రీధర్‌ను అభినందిస్తున్న టీడీపీ నేతలు

చోడవరం టీడీపీ అధ్యక్షుడిగా కలపాల శ్రీధర్

పెనమలూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : చోడవరం గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా తిరిగి కలపాల శ్రీధర్ మరోసారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. క్లస్టరు ఇన్‌చార్జి మారుపూడి ధనకోటేశ్వరరావు, మండలాధ్యక్షుడు కోయ ఆనంద్ ప్రసాద్, సంగెపు రంగారావు ఆధ్వర్యంలోని సోమవారం ఎంపిక పూర్తి చేశారు. ప్రధాన కార్యదర్శిగా చాగర్లమూడి గౌతమ్‌చౌదరి, కోశాధికారిగా గవిర్నేని శేషమాంబ, ఉపాధ్యక్షుడిగా సింహాద్రి చందు ఎంపికయ్యారు. అలాగే గ్రామ తెలుగు యువత అధ్యక్షుడిగా దాసరిహేమంత్, కార్యదర్శిగా ఐనంపూడి రవికుమార్, ఐటీడీపీ అధ్యక్షుడిగా మోదుగు ప్రవీణ్‌కుమార్, తెలుగురైతు అధ్యక్షుడిగా మల్లంపాటి సుబ్బారావు, తెలుగు మహిళ అధ్యక్షురాలిగా గవిర్నేని యామినీకృష్ణ, బీసీ, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా గజ్జలకొండ కోటేశ్వరరావు, చోడవరపు రవిచంద్ ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యులను టీడీపీ శ్రేణులు అభినందందించారు.



ఉపాధ్యాయ సమస్యలపై ఏపీటీఎఫ్ ధర్నా

ఉయ్యూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాల పరిరక్షణ, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన దశల వారీ పోరాటంలో భాగంగా సోమవారం ఉయ్యూరు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిలర్ సీహెచ్ నారాయణమూర్తి మాట్లాడుతూ, గతప్రభుత్వం 117 జీవోతో విద్యారంగాన్ని అతలాకుతలం చేయగా కూటమి ప్రభుత్వం దానిని రద్దు చేసినా, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు శాస్త్రీయమైన ఏర్పాట్లు చేయకపోగా మరింత నష్టం కలిగించే విధానాలను ఎంచుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫెడరేషన్ జిల్లా పూర్వ అధ్యక్షుడు టీఎన్ఎం కోటేశ్వరరావు, పూర్వ రాష్ట్ర కౌన్సిలర్ వై.పరాత్పరి, జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యురాలు డి.అమ్మాజీశ్రీ, టీచర్స్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు వీరంకి వెంకటేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్ డీఎస్ సాంబశివరావు, ఎం.శివమణి, శివకుమార్ పాల్గొన్నారు.



డ్రైనేజీ పూడిక తీత పనులను పర్యవేక్షిస్తున్న పంచాయతీ కార్యదర్శి పూర్ణేశ్వరి

చెత్త బుట్టలు వినియోగించాలి

హనుమాన్‌జంక్షన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : తడి చెత్త, పొడి చెత్త బుట్టలను వినియోగించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రజలు సహకరించాలని బాపులపాడు పంచాయతీ కార్యదర్శి బి.ఎస్. పూర్ణేశ్వరి కోరారు. గ్రామంలో సోమవారం పూడిక తీత పనులను పర్యవేక్షించారు. డ్రైనేజీల్లో చెత్త వేయకుండా బుట్టల్లో వేయాలని కోరారు. ప్లాస్టిక్ గ్లాసులు, క్యారీ బ్యాగులు సాధ్యమైనంత తక్కువ వినియోగిస్తే గ్రామం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. వాటివలన మురుగు నీరు పారుదలకు అడ్డంకులు కలుగుతాయన్నారు.

వాసవీ మాత జయంతి వేడుక రేపు

హనుమాన్‌జంక్షన్, మే 5 (ఆంధ్రజ్యోతి): వాసవీ మాత ఆలయంలో బుధవారం జయంతి నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బొమ్మిశెట్టి రామారావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమ్మవారికి విశేష పూజలు, గ్రామోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.



గన్నవరం ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు



పెనమలూరు ఎంపీడీవో ప్రణవికి, ఉయ్యూరులో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

ఉపాధి హామీ శ్రామికులకు రూ.600 ఇవ్వాలి

గన్నవరం, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ శ్రామికులకు రూ.600 కూలి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కళ్లం రాంబాబు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. సమ్మర్ అలవెన్స్, మెడికల్ కిట్లు, మజ్జిగ, మంచినీళ్లు, పే స్లిప్పులు, వారానికి ఒకసారి చేసిన పనికి నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, తాతబ్బాయి, ఏసుదాసు, ఆంథోని, మిరప నాగేశ్వరరావు, ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరులో ఎంపీడీవోకు వినతిపత్రం

పెనమలూరు, మే5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ శ్రామికుల సమస్యలను పరిష్కరించేందుకు మండల కేంద్రాల వద్ద జరిగే ధర్నాలను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం సీఐటీయూ పిలుపునిచ్చింది. ఉపాధి కార్మికుల సమస్యలపై ఎంపీడీవో బండి ప్రణవికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు మాట్లాడుతూ కార్మికులు పనిచేసే ప్రాంతాల్లో టెంట్లు, మంచి నీటి సౌకర్యం, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవో స్పందిస్తూ ప్రమాద బీమా అప్లికేషన్ పూర్తి చేస్తున్నామని, కార్మికుల డిమాండ్లను కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో కాసిం, వేణు, మరీదు భాస్కరరావు, కాట్రగడ్డ నాగమణి, యోహాను, పిల్లి బాబురావు, పేతురు, జోజి పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం నేతల డిమాండ్

వేతన బకాయిలు చెల్లించాలని ఉయ్యూరులో ధర్నా

ఉయ్యూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ శ్రామికుల వేతన బకాయిలు వెంటనే చెల్లించి, ప్రతికార్డుకు వంద రోజుల పనిదినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎ.తిరుపతయ్య డిమాండ్ చేశారు. కార్మికల సమస్యలు పరిష్కారం కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈసందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ, ఉపాధి కార్మికులకు వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ కష్టమవుతుందన్నారు. వ్యవసాయ పనులు కూడా తగ్గిపోవడంతో ఇబ్బం దిపడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. అనంతరం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బి.రాజేశ్, కీర్తి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో సత్యకుమార్‌కి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేస్తున్న వ్యవసాయకార్మికసంఘం నేతలు

ఉంగుటూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద..

ఉంగుటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఉపాధి హామీ శ్రామికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అజ్జీర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పనిచేసిన నాటినుంచి రెండువారాల్లోపు వేతనాలు చెల్లించాలని ఉపాధిహామీ చట్టం చెబుతోందన్నారు. ఉపాధి నిధులను ప్రభుత్వం వేరే పథకాలకు మళ్లించడంవల్ల వేతనాల చెల్లింపుల్లో నెలలతరబడి జాప్యం జరుగుతోందని ఆరోపించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి శ్రామికుడికి రోజుకు ఆరువందల రూపాయల చెల్లించాలన్నారు. ప్రతి కుటుంబానికి రెండువందల రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పనిప్రదేశాల్లో మంచినీరు, టెంట్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయవద్దని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో ఇ.సత్యకుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టీవీ రామ్మోహనరావు, బి.సుబ్బారెడ్డి, పి.దుర్గారావు, ముసలయ్య, సుందరం, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



తండ్రి అంతిమయాత్రలో పాడె మోస్తున్న కుమార్తె సింధూర

వీకేఆర్ విశ్రాంత అధ్యాపకుడికి అంతిమ వీడ్కోలు

గన్నవరం, మే 5 (ఆంధ్రజ్యోతి) : టీజీవీఎస్ గన్నవరం ఎంప్లాయిస్ కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి, వీకేఆర్ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు బొబ్బా శ్రీనివాసరావు(69) అంతిమయాత్ర సోమవారం జరిగింది. గుండెపోటుతో శ్రీనివాసరావు మృతి చెందారు. 30ఏళ్లకు పైగా వీకేఆర్ కళాశాలలో బోటని అధ్యాపకుడిగా సేవలందించి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. సొసైటీపేటలోని స్వగృహంలో సందర్శనార్థం ఆయన భౌతికకాయాన్ని ఉంచారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, గన్నె వెంకట్రావు, డాక్టర్ మద్దుకూరి విజయ్‌కుమార్, మూ ల్పూరి ప్రసాద్, ఎలినేని శ్రీనివాసరావు, మూల్పూరి మాధవన్, టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, నెక్కలపూడి ఈశ్వరరావు, బొబ్బా విశ్వేశ్వరరావు, జాస్తి మురళీ, చిలకపాటి శంకరరావు, ప్రసాద్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాసరావుకు భార్య శ్రీదేవి, కుమార్తె సింధూర ఉన్నారు.

పెదఓగిరాల టీడీపీ కార్యవర్గం ఏకగ్రీవం

ఉయ్యూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : పెద ఓగిరాల గ్రామ టీడీపీ కార్యవర్గం ఏకగ్రీవమైంది. మండల పార్టీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా భీమవరపు శివకోటి ప్రసాదరెడ్డి, ఉపాధ్యక్షుడిగా పెనుమత్స కల్యాణ్, కార్యదర్శిగా షేక్ మహబూబ్ సుభాని ఎన్నికయ్యారు. ఆకునూరు సర్పంచ్ గోలి వసంతకుమార్, పాలడుగు మాధవీలత, పోతురెడ్డి, కొండాప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



భారతీయ శాస్త్రవేత్తల గురించి వివరిస్తున్న గ్రంథాలయాధికారి స్వర్ణలతాదేవి

విజ్ఞాన, వినోదమే వేసవి శిక్షణ శిబిర లక్ష్యం

హనుమాన్‌జంక్షన్ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : స్నేహపూర్వక వాతావరణంలో విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందిస్తూ విజ్ఞాన వినోదాలను అందించడమే వేసవి శిక్షణ శిబిరాల లక్ష్యమని గ్రంథాలయాధికారి స్వర్ణలతాదేవి, సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. వీరవల్లి, కానుమోలులో సోమవారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా భారతీయ శాస్త్రవేత్తలు, కనుగొన్న విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ధ్యానం, యోగా, మ్యూజికల్ చైర్, చెస్ ఆటల పోటీలు నిర్వహించారు.

పురుషోత్తపట్నం గ్రంథాలయంలో..

గన్నవరం, మే 5 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవటం అభినందనీయమని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు అన్నే కోదండరామయ్య అన్నారు. పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయంలో కేరమ్స్, కథలు చెప్పించటం, చెస్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి కె.కృపానందం తదితరులు పాల్గొన్నారు.





తాడిగడప బాలాజీనగర్‌లో ఖాళీస్థలాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు



విద్యానగర్ వైపు పెరిగిన పిచ్చి మొక్కలు

ఖాళీ స్థలాలపై చర్యలు శూన్యం - ప్రజలకు నరకం

(ఆంధ్రజ్యోతి - పెనమలూరు)

తాడిగడప మునిసిపాలిటీలోని ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరిగిన చెట్లు, తుప్పలు స్థానికులకు నరకం చూపిస్తున్నాయి.

ఖాళీ స్థలాలు అభివృద్ధి చేయకుండా వదిలేసిన చోట్ల వాటిలో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. దీంతో స్థానికులు రాత్రుళ్లు బయటికి వచ్చి రోడ్లమీద నడవాలంటేనే భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. తుప్పల్లోంచి విషపురుగులు, పాములు యథేచ్ఛగా రోడ్లమీదకు వస్తుండడంతో జనం బెంబేలెత్తుతున్నారు.

వర్షపు నీళ్లు, ఇళ్లలోంచి వదిలిన మురుగు నీరు ఖాళీ స్థలాల్లో చేరుతుండడంతో దోమలు విజృంభించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. చర్యలు తీసుకోవల్సి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగితే ఎప్పటికప్పుడు జరిమానా లు విధిస్తామంటూ కొన్నాళ్లు ప్రచారం చేసిన అధికారులు ఆ ఊసే మరిచి పోయారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	148, 157, 168
చికెన్ విత్ స్కిన్	286
చికెన్ స్కిన్‌లెస్	296

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం

గూడూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతిలో ప్రతిభ చూపిన కప్పలదొడ్డి జిల్లా పరిషత్



హైస్కూల్ విద్యార్థులు ఉమ్మిటి నాగశివ విఘ్నేష్, మరక యశశ్రీలక్ష్మి, పేరిశెట్టి కార్తీక్ (560), బెజవాడ నాని (558)లను, వారి తల్లిదండ్రులను సోమవారం ఘనంగా సత్కరించారు. జడ్పీటీసీ సభ్యుడు వేముల రంగసురేష్, హెచ్ఎం జ్యోతి, గ్రామసర్పంచ్ యక్కటి మాధవి నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు పేరిశెట్టి తేజోవతి, మాజీ సర్పంచ్ కట్టా మునీశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కృష్ణా యూనివర్సిటీ వీసీ రాంజీకి అర్జీ ఇచ్చి మాట్లాడుతున్న డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం నాయకులు

డిగ్రీ కళాశాల అధ్యాపకుల సమస్యలు పరిష్కరించండి

మచిలీపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీకళాశాలల్లో పనిచేసే అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా గవర్నమెంట్ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం నాయకులు కృష్ణాయూనివర్సిటీ వీసీ కె.రాంజీకి సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను పరిశోధనా కేంద్రాలుగా, డిగ్రీ అధ్యాపకులకు పూర్తిస్థాయిలో మూల్యాంకనం చార్జీలు అందించాలని, యూనివర్శిటీలో ఎంఏ తెలుగు కోర్సును పునరుద్ధరించాలని వినతిపత్రంలో కోరారు. గవర్నమెంట్ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం కార్యదర్శి జె.రాముడు, దేవానందకుమార్, ఎస్ కరీముల్లా వీసీని కలిసిన వారిలో ఉన్నారు.



చల్లపల్లి శ్రీఆర్యవైశ్య సంఘ కార్యవర్గం

అధ్యక్షుడిగా పాండురంగారావు, ప్రధాన కార్యదర్శిగా వరదా

చల్లపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి శ్రీఆర్యవైశ్యసంఘం నూతన కార్యవర్గం (2025-27) ఎన్నిక జరిగింది. సంఘం 92వ వార్షికోత్సవం సందర్భంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అన్నవరపు పాండురంగారావు, ప్రధాన కార్యదర్శిగా వరదా హరిగోపాల్, కోశాధికారిగా వరదా రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా కొల్లిపర సాంబశివరావు, సహాయ కార్యదర్శిగా విస్సంశెట్టి మారుతీరామ్, కార్యవర్గ సభ్యులుగా తమ్మన సతీష్‌కుమార్, కొల్లిపర సురేంద్ర, కొల్లిపర నరేంద్ర, ఉడత్తు సురేష్, విస్సంశెట్టి హరీష్, జూహూడి కిరణ్, జల్లూరి ప్రసాద్, తమ్మన సాంబశివరావు, ఉరిమి మణికంఠ, కొల్లిపర రజని ఎన్నికయ్యారు. ఆర్యవైశ్య సంఘం పెద్దలు కొల్లిపర మధు, నూజెళ్ల బాబు, ఉడత్తు శివరామకృష్ణవరప్రసాద్(బాబు), జూహూడి సాయి నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. అధ్యక్షుడు పాండురంగారావు మాట్లాడుతూ, సమాజహిత సేవలో భాగస్వాములవుతామని తెలిపారు.



కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందిస్తున్న స్వచ్ఛ కార్యకర్తలు

చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

చల్లపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి) : విచక్షణారహితంగా, అనుమతులు లేకుండా చెట్లను నరికివేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్వచ్ఛ కార్యకర్తలు సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు. పెదకళ్లేపల్లి రోడ్డులోని శివరామపురం వద్ద 2017 లో నాటి పెంచిన చెట్లను ఎటువంటి అనుమతులు లేకుండా ఇటీవల నరికివేశారని, చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనుమతులు లేకుండా డ్రెయిన్లలో పిల్లర్లు వేస్తూ చేపడుతున్న వంతెన నిర్మాణాలను అడ్డుకుని, మురుగునీటి పారుదలకు ఇబ్బందులు లేకుండా చేయాలని విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛ కార్యకర్తలు ప్రాతూరి శాస్త్రి, సజ్జా ప్రసాద్, వేముల శ్రీనివాస్ వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు.

పెహల్గాం మృతులకు దైవసేవకుల నివాళి



చల్లపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి) : పెహల్గాం ఉగ్రదాడిలో మరణించిన పర్యాటకుల కుటుంబాలకు ఇమ్మానియేల్ యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం నివాళులు అర్పించారు. అసోసియేషన్ సమావేశం అనంతరం మరణించిన పర్యాటకులకు ఆత్మశాంతి కలగాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉగ్రవాదం నశించాలనీ, మతసామరస్యం కలిగి ఉండాలని, దేశ రక్షణ కాంక్షిస్తూ ప్రార్థించారు. అసోసియేషన్ నేతలు పి.సాల్మన్‌రాజు, బిషప్ ఎం.మరియకుమార్, తాతా సత్యమూర్తి, జి.యేసురాజు, పల్లికొండ ఏసుదాస్, డేవిడ్ గోల్కొండ, సాంబశివరావు పాల్గొన్నారు.



అంకమ్మ సేవలో ఎమ్మెల్యే మండలి దంపతులు

మోపిదేవి, మే 5 (ఆంధ్రజ్యోతి) : బొబ్బర్లంకలో అంకమ్మ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు రెండోరోజు సోమవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు, విశేష అలంకరణ గావించారు. వేదపండితులు గుండిపూడి నాగ రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో రుత్వికుల బృందం చండీహోమం, రుద్ర హోమం నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు రుద్రహోమంలో పాల్గొని పూర్ణాహుతి సమర్పించారు. గ్రామసర్పంచ్ దొప్పలపూడి గంగాభవాని, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్లాస్టిక్ వస్తువుల వాడకం తగ్గించాలి

మచిలీపట్నం టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ సంచులు, వస్తువుల వాడకం తగ్గించాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు సూచించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో క్లాత్ సంచీల పంపిణీ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు సోమవారం ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వస్తువుల వాడకం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు పి శ్రీరాం, ఉపాధ్యక్షుడు అయ్యప్ప స్వామి, నూర్జహాన్, ఆదిత్య, ఆర్డీవో కె స్వాతి తదితరులు పాల్గొన్నారు.



బందరులో ఎనిమిదో రోజు సమ్మెలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కమ్యూనిటి హెల్త్ అధికారులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ కార్మికులు



నాగాయలంక తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

కార్మికులు, ఉద్యోగులు, కూలీల ఆందోళన

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులు, ఉపాధి కూలీలు తహసీల్దార్ కార్యాలయాల వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. ఏపీటీఎఫ్, ఎస్ఎంయూ, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు ఈ ఆందోళనకు నేతృత్వం వహించారు

కమ్యూనిటీ హెల్త్ అధికారుల ధర్నా

మచిలీపట్నం టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : జీతాలు పెంచాలంటూ కమ్యూనిటీ హెల్త్ అధికారులు నిర్వహిస్తున్న సమ్మె సోమవారం నాటికి ఎనిమిదో రోజుకు చేరింది. సంఘ నాయకులు నిరంజన్ తదితరులు మాట్లాడుతూ, ఆయూష్మాన్ భారత్ మార్గదర్శకాలకు అనుగుణంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని, 23 శాతం జీతం పెంచాలని డిమాండ్ చేశారు. ఇన్ని రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదని సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా

ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, కారుణ్య నియామకాలు జరపాలని, అర్హత గల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డి నాంచారయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో డిపో అధ్యక్షుడు వివి రావు, కార్యదర్శి ఎం. కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పదోన్నతులు కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

ఏపీటీఎఫ్ ధర్నా

మచిలీపట్నం టౌన్ : అర్హులైన టీచర్లకు పదోన్నతులు కల్పించాలని, బదిలీల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు అంబటిపూడి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో రాష్ట్ర కౌన్సిలర్ ఏ. రామగోపాల్, గూడూరు మండల ఏపీటీఎఫ్ అధ్యక్షుడు కరామత్ అలీ, శ్రీనివాసరావు, సురేష్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** పాఠశాల విద్యావ్యవస్థలో రీ ఆర్గనైజేషన్ ప్రక్రియలో ఉన్న అసమానతలు సవరించాలని కోరుతూ ఏపీటిఎఫ్ రాష్ట్ర సంఘ పిలుపు మేరకు అవనిగడ్డ పాత తాలూకా కార్యాలయం వద్ద జోనల్ కమిటీ నిరసన ప్రదర్శన చేపట్టింది. జోనల్ కన్వీనర్ చీర్ల నాగ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వి.సాంబశివరావు, ఉపాధ్యక్షులు కె.నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ జి.వెంకటేశ్వరరావు, సంఘ నేతలు గిరిధర సుబ్బారావు, జి.వి.శేషగిరి, ఎం.వి.రమణ, పి.మాధవరావు, ఏ.కోటేశ్వరరావు, జి.రోహిణి కుమార్, ధర్మజ్ఞాని, బి.లలిత కుమారి తదితరులు తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకు వినతిపత్రాన్ని సమర్పించారు.



మోపిదేవిలో ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు, నేతలు



చల్లపల్లిలో ధర్నా చేస్తున్న ఉపాధి కార్మికులు

ఉపాధి కార్మికుల ధర్నా

మోపిదేవి : గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పని చేసిన కూలీలకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలంటూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలు కూలీలు పాల్గొన్నారు. ప్రతి కార్మికునికి 100 రోజుల పని కల్పించాలని, పని లేకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలని, పెండింగ్ వేతనాలు చెల్లించి, పేస్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేసవి కాలం నేపథ్యంలో తాగునీరు, మజ్జిగ, మెడికల్ కిట్లు, టెంట్లు ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపీడీవో స్వర్ణభారతికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి సిహెచ్.రాజశేఖర్, కమిటీ సభ్యులు బెజవాడ నాగేశ్వరరావు, కొమ్ము జయరావు తదితరులు ఉన్నారు.

చల్లపల్లి : ఉపాధి కూలి బకాయిలు చెల్లించాలని చల్లపల్లి మండల సీపీఎం కార్యదర్శి యద్దనపూడి మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నేతలు సోమవారం చల్లపల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేసి ఎంపీడీవో ఏ.వి.రమణకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. మధు మాట్లాడుతూ, ఉపాధి కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలనీ, 100 రోజులు పని కల్పించలేక పోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి కొత్తగా జాబ్‌కార్డులు ఇవ్వాలనీ, పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలన్నారు. అన్ని గ్రామాల్లో మేట్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలనీ, పారితోషికాన్ని రూ.5 వేలకు పెంచి ఇవ్వాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు మేడేపల్లి వెంకటేశ్వరరావు, బండారు కోటేశ్వరరావు, సీఐటీయూ కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, గోళ్ల సాంబశివరావు, బళ్ల వెంకటేశ్వరరావు, బొందలపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

చల్లపల్లి : రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ డి.వనజాక్షికి వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం జిల్లా నేత యద్దనపూడి మధు మాట్లాడుతూ, మినుములను క్వింటాకు రూ.9వేల చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేయాలనీ, అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలను రైతులు, కౌలు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలనీ, రైతులకు రూ.3 లక్షల రుణాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దుచేయాలని, సార్వా పంటకు విత్తనాలు 75 శాతం సబ్సిడీపై అందచేయాలనీ, డ్రైనేజీ, పంట కాల్వల పూడికతీత చేపట్టాలని కోరారు. రైతుసంఘం నేతలు, సీపీఎం, అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఎదురుమొండి - నాచుగుంట రహదారి పూర్తి చేయాలి

నాగాయలంక, మే 5 (ఆంధ్రజ్యోతి) : అటవీ శాఖ అధికారుల అభ్యంతరాలు కారణంగా నిలిచిపోయిన ఎదురుమొండి - నాచుగుంట రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మత్స్యకార సంఘ నాయకులు లకనం నాగాంజనేయులు, రేవు సువర్ణరాజు, కర్రి కృష్ణమూర్తి సోమవారం నాగాయలంక మండల తహసీల్దార్ ఎం.హరనాథ్‌కు పబ్లిక్ గ్రీవెన్స్ సెల్‌లో విజ్ఞాపన పత్రం అందజేశారు.

చేనేత పరికరాలను దహనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మచిలీపట్నం టౌన్ : గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామంలో పేరిశెట్టి పైడేశ్వరరావు, బూసం పురుషోత్తంల చేనేత ముడి సరుకులను, పరికరాలను దహనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం బాధితులు ఏఎస్పీ సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఏప్రిల్ 24న ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. సంఘ నాయకులు బండారు ఆనందప్రసాద్, పడవల మోహన్, త్రినాథ్, కప్పలదొడ్డి సర్పంచ్ యక్కల నాగరాజు, పోలవరం మాజీ సర్పంచ్ కారుపర్తి నాగమల్లి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కూటమి ప్రభుత్వానికే సాధ్యం

ఘంటసాల, మే 5 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమం కూటమి ప్రభుత్వానికే సాధ్యమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆవరణలో వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీపై మంజూరైన వ్యవసాయ పరికరాలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సోమవారం రైతులకు పంపిణీ చేశారు. రైతులు యాంత్రీకరణ విధానాన్ని అవలంబించటం అభినందనీయమనేని, ప్రకృతి వ్యవసాయం వైపు కూడా ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా 96 మంది రైతులకు రూ.13 లక్షల సబ్సిడీతో కూడిన వ్యవసాయ యంత్ర పరికరాలను అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, పరుచూరి సుభాష్ చంద్రబోస్, శ్రీకాకుళం డీసీ ఛైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ వేమూరి సాయి వెంకట రమణ, ఎంపీటీసీలు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), సిద్ధినేని కుమార్ రాజా, పరిశె చలపతి, ఆవుల ధర్మ వెంకట నరసయ్య, ఉప్పల ప్రసాద్, వేమూరి రత్నగిరిరావు, అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కూటమి నేతలు

రెండు రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు

అవనిగడ్డ : నియోజకవర్గంలోని రెండు నూతన రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు.. మోపిదేవి మండలం వెంకటాపురం నుంచి పెదకళ్లేపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్ల 60 లక్షలు, అవనిగడ్డ మండలం కొత్తపేట నుంచి మోదుమూడి బ్రిడ్జి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.55 లక్షలు మంజూరైనట్లు ఆయన తెలిపారు.

రామకృష్ణాపురం పాఠశాలకు రూ.50 వేల విరాళం



హెచ్ఎం, గ్రామస్థులకు విరాళాన్ని అందజేస్తున్న వెంకటేశ్వరరావు

కోడూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : రామకృష్ణాపురం మండల పరిషత్ పాఠశాలకు మొవ్వ మండలం పద్దారాయుడుతోట గ్రామ నివాసి చిముటూరు వెంకటేశ్వరరావు రూ.50 వేలు విరాళాన్ని అందజేశారు. జిల్లా పరిషత్ పాఠశాలగా అప్‌గ్రేడ్ కావడం, స్థల సేకరణ, అభివృద్ధి పనులు జరుగుతుండడంతో తాను చదువుకున్న పాఠశాలకు సహకారం అందించాలని విరాళాన్ని అందించినట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. హెచ్ఎం కె.నాగార్జున, గ్రామ పెద్దలు ఈ విరాళాన్ని అందుకున్నారు. అద్దంకి పాండురంగారావు, రాంబాబు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాగాయలంక, మే 5 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంకలో మూడు ప్రైవేట్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 25 శాతం ఫీజు రాయితీతో ఒకటో తరగతిలో చేరేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో టి.వి.ఎం.రామదాసు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఒకటవ తరగతిలో చేర్చుకోవటానికి ఈనెల 15 వరకు గడువు ఉందని, ఆసక్తి గల తల్లిదండ్రులు పూర్తి వివరాలతో ఎంఈవో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్ జిల్లా కమిటీలో నలుగురు పెడన నేతలకు చోటు

పెడన, మే 5 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ జిల్లా కమిటీలో పెడనకు చెందిన నలుగురు కాంగ్రెస్ నేతలకు స్థానం లభించింది. డీసీసీ జనరల్ సెక్రటరీగా రాగి రమేష్, సెక్రటరీగా జన్యావుల లీలాకృష్ణ, జాయింట్ సెక్రటరీలుగా సిరివెళ్ళ రామకృష్ణ, ఖాన్‌లను నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లు కృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు.

వైభవంగా మండవ వారి గంగమ్మ జాతర

నాగాయలంక, మే 5 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంక బస్టాండ్ రోడ్డులో కొలువై ఉన్న మండవ వారి ఇలవేల్పు గంగమ్మ జాతర మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు మేళతాళాలతో విరివిగా తరలివచ్చి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది. ఏఎంసీ మాజీ ఛైర్మన్ మండవ బాలవర్థిరావు దంపతులు, మండవ వంశీయులు, ఆలయ ఛైర్మన్ మండవ మధుసూదనరావు (బుజ్జి), కుటుంబసభ్యులు పర్యవేక్షించారు.

ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు

పెడన, మే 5 (ఆంధ్రజ్యోతి) : పెడన మండలం బల్లిపర్రు గ్రామంలో ఈనెల 1వ తేదీ రాత్రి దళిత మహిళ జల్లుల తిరుమలపై దాడి ఘటనకు సంబంధించి ముగ్గురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ రాజా విచారణ జరిపిన అనంతరం సురేంద్ర, నరేంద్ర, నాగలపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు.

పాత ఉపకాలి గ్రామానికి ట్యాంకర్ల నీరు

నాగాయలంక, మే 5 (ఆంధ్రజ్యోతి) : వేసవి నేపథ్యంలో తీర గ్రామాల దాహం తీర్చేందుకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఉచితంగా తాగునీరు సరఫరా చేస్తున్నారు. సంగమేశ్వరం పంచాయతీ శివారు పాత ఉపకాలి గ్రామానికి 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేశారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధురాలి మృతి



మోపిదేవి, మే 5 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. ఈ నెల 4వ తేదీన సాయంత్రం సమయంలో జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న వృద్ధురాలు మోటారు సైకిల్ ఢీకొనటంతో తీవ్రంగా గాయపడింది. వృద్ధురాలిని మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. వృద్ధురాలి ఆచూకీ తెలిసిన వ్యక్తులు మోపిదేవి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాల్సిందిగా ఎస్సై సత్యనారాయణ కోరారు.

గుడివాడ

● గుడివాడ ● పామర్రు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	148, 157, 168
చికెన్ విత్ స్కిన్	286
చికెన్ స్కిన్‌లెస్	296

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 470



పెదపారుపూడి ఎంపీడీవోగా సయ్యద్ సాధిక్

పెదపారుపూడి, మే 5 (ఆంధ్రజ్యోతి): పెదపారుపూడి ఎంపీడీవోగా సయ్యద్ సాధిక్ సోమవారం విధులను చేపట్టారు. ఇంచార్జ్ ఎంపీడీవో పి.మల్లేశ్వరి నుంచి ఆయన చార్జ్ తీసుకున్నారు. బాపట్ల జిల్లా పర్చూరు మండల పరిషత్ పరిపాలనాధికారిగా పని చేస్తున్న సాధిక్ ఇటీవల ఎంపీడీవోగా పదోన్నతి పొంది, పెదపారుపూడి ఎంపీడీవోగా నియమితులయ్యారు. నూతన ఎంపీడీవోకు డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్, పలువురు పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.



సయ్యద్ సాధిక్



వినతిపత్రం అందజేస్తున్న గంటా శ్రీనివాసరావు

అక్రమ మట్టి తవ్వకాలను నివారించాలని అర్జీ

గుడివాడ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): మోటూరులోని పంచాయతీ చెరువులోని మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు గంటా శ్రీనివాసరావు తెలిపారు. అక్రమ మట్టి తవ్వకాలు ఆపాలని కోరుతూ జిల్లా కలెక్టర్ బాలాజీకి ఆర్డీవో కార్యాలయంలో ఆయన సోమవారం అర్జీని అందజేశారు. పంచాయతీ చెరువుల్లో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ఆరోపించారు. దీంతో గ్రామపంచాయతీ ఆదాయానికి గండి పడుతుందన్నారు. కొందరు పంచాయతీ చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు చేసి ట్రాక్టర్ల ద్వారా బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారన్నారు. అక్రమ మట్టి తవ్వకాలను నివారించాలని జిల్లా కలెక్టర్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

కలెక్టర్ డీకే బాలాజీ

గుడివాడ, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ సమస్యల పరిష్కారానికై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

● వలివర్తిపాడు పంచాయతీ పరిధిలోని సాయినిలయం అపార్టుమెంట్‌లో వెయ్యి మంది నివసిస్తున్నారు. వారు తాగునీరు లేక చాలా ఇబ్బందిగా పడుతున్నామని అపార్టుమెంట్ వాసి వేణుగోపాలరావు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

● స్థానిక ధనియాలపేట, కొత్తకాలనీలలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లు విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని కాలనీ వాసులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కాలనీ పార్కు స్థలం వద్ద గల భవనంలో గంజాయి, మద్యం సేవిస్తున్నట్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లామని , పోలీసు వారినే బ్యాచ్ బెదిరిస్తున్నారని వారు వాపోతున్నారు. కాలనీవాసులకు రక్షణ కల్పించాలని కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జా నాగరాజు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. మీ కోసం కార్యక్రమంలో దాదాపుగా 70 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు.

● మోటూరు బీసీ కాలనీలో ఇంటిపై నుంచి విద్యుత్ లైన్లు, స్తంభాలు ఉన్నాయని, వెంటనే విద్యుత్ లైన్లను మార్చాలని వనం విజయశాంతి, కె.స్వప్న, చౌటూరి వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు అర్జీ అందజేశారు.

● స్థానిక టీచర్స్ కాలనీలో డ్రెయినేజీ లేకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి, దోమలకు ఆవాసంగా మారాయి. వెంటనే డ్రెయినేజీని బాగు చేయాలని కాలనీవాసులు వేణుగోపాలరావు అర్జీ అందజేశారు.



ప్రజల సమస్యలను వింటున్న కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే వెనిగండ్ల

వెంటనే కలెక్టర్ సంబంధిత అధికారులను పిలిచి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు, ఎంపీడీవో బి.వై విష్ణుప్రసాద్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

● ఏవో అనంతలక్ష్మి

గుడివాడ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో అనంతలక్ష్మి తెలిపారు. సోమవారం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏవో ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ వీఏఏలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లి పెసర, జనుము విత్తనాలు సబ్సిడీపై వస్తున్నాయని, రైతులు పొలాల్లో వేసుకునేలా చూడాలని తెలిపారు. రైతులు పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు వేయటం వల్ల పొలానికి సేంద్రీయ ఎరువు వేసినట్లు అవుతుందని వివరించారు. ప్రతి రైతుకూ అవగాహన కల్పించి పచ్చిరొట్ట విత్తనాలు కొనుగోలు చేసేలా చూడాలని తెలిపారు. అన్నదాన సుఖీభవ పథకం కింద రైతుల సర్వే నెంబర్లు, బ్యాంక్ అక్కౌంట్లు వెరిఫికేషన్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు దేవనబోయిన అనుష, బి.అనిత, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో అనంతలక్ష్మి

డిగ్రీ కళాశాల అధ్యాపకుల సమస్యలు పరిష్కరించండి

మచిలీపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీకళాశాలల్లో పనిచేసే అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా గవర్నమెంట్ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం నాయకులు కృష్ణాయూనివర్సిటీ వీసీ కె.రాంజీకి సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను పరిశోధనా కేంద్రాలుగా, డిగ్రీ అధ్యాపకులకు పూర్తిస్థాయిలో మూల్యాంకనం చార్జీలు అందించాలని, యూనివర్శిటీలో ఎంఏ తెలుగు కోర్సును పునరుద్ధరించాలని వినతిపత్రంలో కోరారు. గవర్నమెంట్ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం కార్యదర్శి జె.రాముడు, దేవానందకుమార్, ఎస్ కరీముల్లా వీసీని కలిసిన వారిలో ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ధర్నా

కూచిపూడి, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ సంఘ నేతలు ఈవి.రామారావు, ఏ.సురేష్‌లు డిమాండ్ చేశారు. మొవ్వ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయులు, సంఘ నేతలు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో మాతృభాష మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు. సీపీఎస్, జీపీఎస్ రద్దు చేయాలన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్ నియమించి ఐఆర్ ప్రకటించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను తక్షణమే ప్రకటించాలన్నారు. 11వ పీఆర్‌సీ బకాయిలతోపాటుగా ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన అన్నిరకాల ఆర్థిక బకాయిలు చెల్లించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్య అనుసంధానించాలన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా అన్ని ప్రాంతాల్లో పాఠశాలలు నెలకొల్పాలని డిమాండ్ చేశారు. అనంతరం మొవ్వ తహసీల్దార్ మస్తాన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కె.ఎన్.సోమేశ్వరమ్మ, కె.నాగరాజు, కె.శివలక్ష్మి, జి.వెంకటేశ్వరరావు, బి.మాణిక్యాలరావు, రవీంద్రబాబు, చల్లపల్లి, ఘంటసాల, మొవ్వ మండలాలకు చెందిన నేతలు పాల్గొన్నారు.



మొవ్వలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఫిల్టర్ బెడ్‌లు రిపేరు చేయించినా ప్రయోజనం శూన్యం

● వెంకట రామాపురం సర్పంచ్ సురేష్ ధ్వజం

నందివాడ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఫిల్టర్ బెడ్‌లు రిపేర్లు చేయించినా ప్రయోజనం శూన్యమని వెంకట రామాపురం సర్పంచ్ కాకరాల సురేష్ మండల సమావేశంలో ధ్వజ మెత్తారు. ఎంపీపీ పెయ్యేల ఆదాము ఆధ్వర్యంలో సోమవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందివాడ నుంచి తమిరిశ, పొలుకొండ వెళ్లే రహదారి పూర్తిగా గోతులమయంగా మారిందన్నారు. దీంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సివస్తుందని ఆయన వివరించారు. శంకరంపాడు సర్పంచ్ కైలే సుబ్బారావు మాట్లాడుతూ మంచినీటి చెరువులకు వదులుతున్న నీళ్లన్నీ చేపల చెరువులకే పరిమితమవుతున్నాయన్నారు. తుమ్మలపల్లి సర్పంచ్ రాధాకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మన మండలానికి రోడ్లు, ఫిల్టర్ బెడ్లకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్లు తీసుకొచ్చి పనులు చేయిస్తున్నారన్నారు. అనంతరం ఎంపీడీవో మల్లేశ్వరి మాట్లాడుతూ సోలర్ ప్లాంట్లు మధ్య తరగతి వాళ్లకు బాగా ఉపయోగకరమన్నారు. ప్రతీ ఒక్కరూ సోలార్ ప్లాంట్లకు ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కందుల దుర్గాకుమారి, సుధాకర్, జయరాజు, ఈవోపీఆర్డీ అమీర్ మీర్జా బాషా, ఏవో కోటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. కాగా ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖ అధికారులు పాల్గొనలేదు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ రాధాకృష్ణ

శ్రామికులకు పనిభద్రత కల్పించాలని ఆందోళనలు



మొవ్వలో ధర్నా చేస్తున్న ఉపాధి శ్రామికులు

కూచిపూడి, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి శ్రామికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మొవ్వలో సోమవారం ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు మాట్లాడుతూ కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించి, సమ్మర్ అలవెన్సులు ఇవ్వాలని కోరారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కనీస వేతనం రోజుకు రూ.600లకు పెంచాలని కార్మిక సంఘాల నేతలు, కూలీలు నినాదాలు చేశారు. అనంతరం ఎండీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సంఘనేతలు కరుణాకర్, శ్రీనివాసరావు, పి.వెంకటేశ్వరరావు, రాజశేఖర్, పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పామర్రు : జాతీయ ఉపాధిహామీ పథకం శ్రామికులకు పనిభద్రతతోపాటు వందరోజులు పనికల్పించే బాధ్యత ప్రభుత్వానిదేనని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ నేత వై.నరసింహారావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉపాధిహామీపథకం కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల సమయంలో శ్రామికులకు ప్రమాదాలు జరిగితే, వారికి తక్షణమే సరైన వైద్య సదుపాయం అందించాలన్నారు. దీంతోపాటుగా అవసరమైన బాధితులకు నష్టపరిహారం అందించాలన్నారు. అనంతరం ఎంపీడీవో కె.జ్యోతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి గంగాధర్‌ప్రసాద్ , పామర్రు వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి విల్సన్ రాజు, వెంకటేశ్వరమ్మ, విజయలక్ష్మి, పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : ఉపాధిహామీ శ్రామికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తోట్లవల్లూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. కె. కొండలబాబు, జె. ఏసేబు, డేవిడ్‌రాజు, ఆదిశేషు, జి. సుబ్బారావులు ధర్నా నిర్వహించారు.

పమిడిముక్కల : ఉపాధిహామీ శ్రామికుల వేతన బకాయిలు వెంటనే చెల్లించి, ప్రతికార్డుకూ వంద రోజుల పనిదినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కె.శివనాగేంద్రం డిమాండ్ చేశారు. ఉపాధిహామీ శ్రామికుల సమస్యలు పరిష్కారం కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నాచేశారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించి, వేతన స్లిప్పులు ఇవ్వాలన్నారు. చట్ట ప్రకారం వందరోజుల పనిదినాలు కల్పించని పక్షంలో నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి కొత్త జాబ్‌కార్డులు ఇవ్వాలన్నారు. ఉమ్మడి కార్డులో వివాహమైన వారిని విభజించి కొత్తకార్డులు ఇవ్వాలని కోరారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించి , గాయపడిన వారికి వెంటనే వైద్య సహాయం అందజేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికసంఘం, ఉపాధి హామీ శ్రామికుల సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పామర్రులో ఆందోళన చేస్తున్న ఉపాధి శ్రామికులు



పమిడిముక్కలలో ధర్నా చేస్తున్న ఉపాధి శ్రామికులు

మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

కూచిపూడి, మే 5 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపాటుకు గురై మృతి చెందిన కోసూరు గ్రామానికి చెందిన మాతంగి సుప్రదీప్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నేతల బృందం సోమవారం తహసీల్దార్ మస్తాన్‌కు వినతిపత్రం అందజేశారు. సుప్రదీప్ మరణంతో ఈ కుటుంబం రోడ్డున పడిందన్నారు. మానవీయకోణంలో ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నేతలు విజ్ఞప్తి చేశారు. శీలం నారాయణరావు, కొడాలి శ్రీనివాసరావు, రాజశేఖర్, లాజరు, కరుణాకర్, తదితరులు వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతల బృందం

ప్లాస్టిక్ వస్తువుల వాడకం తగ్గించాలి

మచిలీపట్నం టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ సంచులు, వస్తువుల వాడకం తగ్గించాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు సూచించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో క్లాత్ సంచుల పంపిణీ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు సోమవారం ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వస్తువుల వాడకం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు పి శ్రీరాం, ఉపాధ్యక్షుడు అయ్యప్పస్వామి, నూర్జహాన్, ఆదిత్య, ఆర్డీవో కె స్వాతి పాల్గొన్నారు.

సృజనాత్మకతకు వేసవి శిక్షణలు దోహదం

పామర్రు, మే 5 (ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణా తరగతులు పిల్లల్లో సృజనాత్మకత శక్తి పెంపొందింపజేస్తామని పామర్రు జిల్లా గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి అన్నారు. గ్రంథాలయాల్లో పిల్లలకు నిర్వహిస్తున్న వేసవి తరగతుల్లో భాగంగా సోమవారం చిన్నారులకు, పలు అంశాలపై శిక్షణనివ్వడంతోపాటుగా జాతీయ నాయకులు చరిత్రను వివరించి, దేశభక్తి గీతాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. ఇదేవిధంగా మండల పరిధిలో జమీగొల్వేపల్లి గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.నాగసురేష్, గుమ్మడి ఉషాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.



దేశభక్తి గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు



మొక్కలు నాటుతున్న తారకరామా వాకర్స్ క్లబ్ సభ్యులు

మొక్కలు నాటే కార్యక్రమం

గుడివాడ, మే 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సోమవారం తారకరామా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో పలు చోట్ల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మెరుగుమాల బ్రహ్మయ్య, కార్యదర్శి బచ్చు రాధాకృష్ణ, గంగాధర్‌రావు, శైలజ, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, గౌరీనాథ్, సతీష్‌కుమార్, చింతలూరి సత్యనారాయణ, రామ్మోహనరావు, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ రహదారిపై ప్రయాణం సాహసమే..

● నిత్యం రోడ్డు ప్రమాదాల భారిన పడుతున్న ప్రయాణికులు ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - గుడ్లవల్లేరు) : కౌతవరం - నిడుమోలు ప్రధాన రహదారి విస్తరణ, నిర్మాణం పనులు 2022లో ప్రారంభించారు. అయితే ఈ పనులు ప్రారంభంలో కొంతకాలం వేగంగానే సాగాయి. ఆతరువాత నిధుల కొరతతో ఏడాదికి పైగా నిలిచిపోయాయి. 60 శాతం వరకూ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కేవలం 40 శాతం పనులు పూర్తి కావలసి ఉంది. కూటమి అధికారంలోకి వచ్చాక నిధులు విడుదల చేశారనీ, రహదారి మరమ్మతు పనులు పూర్తి చేస్తామని 2024 డిశంబరులో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము డోకిపర్రులో ఓ కార్యక్రమంలో ప్రకటన చేశారు. ప్రకటన చేసి ఐదు నెలలైనా ఇప్పటికీ కౌతవరం నుంచి డోకిపర్రు వరకూ రోడ్డు నిర్మాణం పూర్తికాలేదు. రహదారి నిర్మాణం చేపట్టాలని జనవరిలో ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో కౌతవరం నుంచి రైల్వే గేటు వరకూ, డోకిపర్రు మసీదు వద్ద నుంచి గూడెం సెంటరు వరకూ కంకర గుట్టలు వేసి వదిలేశారు. రోడ్డు మధ్య వరకూ వేసిన కంకర గుట్టల వల్ల ప్రయాణికులు రాకపోకల సమయాల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే రహదారి నిర్మాణం పూర్తి చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



అధ్వానంగా కౌతవరం - నిడుమోలు రోడ్డు

రహదారి పూర్తిగా ధ్వంసమైంది

డోకిపర్రు రహదారి పూర్తిగా ధ్వంసమైంది. దీంతో రాకపోకల సమయాల్లో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. రహదారి మరమ్మతు పనులు పూర్తి చేయించాలి.



అల్లూరి ఆంజనేయులు, పెసరమిల్లి

సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తుంది

డోకిపర్రు రోడ్డులో ప్రయాణించాలంటే సర్కస్‌ఫీట్లు చేయాల్సి వస్తుంది. రోడ్డుపై ఏర్పడిన గోతులతో నిత్యం ప్రయాణికులు అనారోగ్యం బారీన పడక తప్పడం లేదు.



జోగి దుర్గాప్రసాద్ , డోకిపర్రు

నిధులు మంజూరు కాలేదు

రహదారి నిర్మాణం 40 శాతం పూర్తి కావల్సి ఉంది. నిధులు మంజూరు కాలేదు. నిధులు విడుదల కాగానే రహదారి నిర్మాణం పూర్తి చేస్తాం.

కామేశ్వరరావు , గుడివాడ ఆర్అండ్‌బీ డీఈ



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ పండు

ఘనంగా బిషప్ జన్మదినోత్సవం

గుడివాడ, మే 5 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బిషప్ పండు మద్దాల జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నాగవరప్పాడులోని డాక్టర్ పండు స్వగృహంలో జరిగిన వేడుకల్లో ఫెలోషిప్ నాయకులు జి.శ్యాంబాబు, వాసుపల్లి రాంప్రసాద్, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.